ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 1 జూన్ 2025



## 4 నుంచి ఐటీఐ మొదటి విడత కౌన్సిలింగ్

సాలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) మొదటి విడత కౌన్సిలింగ్ ప్రక్రియ ఈ 4వ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఐటీఐల జిల్లా కన్వీనర్ వి.రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్లు పొందేలనుకునేవారు సాలూరు ప్రభుత్వ ఐటీఐ వద్దకు హాజరుకావాలని పేర్కొన్నారు. రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, టెన్త్ మార్కుల షీట్, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో రావాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 90525 08903 నెంబరును సంప్రదించాలన్నారు.

- ఏజెన్సీలో తక్కువ.. పట్టణాల్లో ఎక్కువ
- ఇదీ పైనాపిల్ ధర పరిస్థితి
- గిరిజనులకు నష్టం.. వ్యాపారులకు లాభం
- గిట్టుబాటు కావడం లేదని రైతుల గగ్గోలు
- ఉన్నతాధికారులు స్పందించాలని విన్నపం



వారపు సంతకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న పైనాపిల్

# ఇక్కడ 15.. అక్కడ 35

సీతంపేట రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో పండే పైనాపిల్ రుచికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే.ఈ ప్రాంత గిరిజనులు ఎటువంటి రసాయనాలు లేకుండా సాగు చేపడు తుంటారు. అందుకే ఇక్కడి పైనాపిల్‌ను కొనేందుకు మైదాన ప్రాంత వ్యాపారులు క్యూకడుతుంటారు. ప్రస్తుతం పైనాపిల్ పంట సీజన్ ప్రారంభమైంది. ఒక పక్క విస్తారంగా వర్షాలు కురుస్తుంటే మరో పక్క గిరిజన రైతులు పైనాపిల్‌ను గుట్టలుగా పోసి మైదాన ప్రాంత వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అయితే సింహాచలం రకానికి చెందిన పండు ధర రూ.15 మాత్రమే పలు కుతోంది. దీంతో గిట్టుబాటు కాకపోవడంతో గిరిజన రైతులు లబోదిబో మంటున్నారు.



సీతంపేట సంతలో పైనాపిల్ ఇలా..

### ఇదీ పరిస్థితి..

- ఏజెన్సీ ప్రాంతంలో సుమారు 10వేల హెక్టార్లకు పైగా ఈ పంట పండుతోంది. అంతర పంటల్లో భాగంగా గిరిజన రైతులు పైనాపిల్ సాగు చేపడుతుంటారు. అయితే సీజన్ ప్రారంభం నుంచి ఈ పంటకు గిట్టుబాటు ధర లేదు. దీంతో గిరిజన రైతులు తలలు పట్టుకుంటున్నారు. వాస్తవంగా ఏటా సుమారు 20వేల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుంది. సీజన్ ప్రారంభంలో ధర తక్కువ పలుకుతున్నప్పటికీ తర్వాత రోజుల్లో పెద్ద సైజు కాయ ధర రూ.18 నుంచి 20వరకు పలికే అవకాశాలు ఉన్నాయని గిరిజన రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
- మన్యంలో క్యూ, సింహాచలం రకానికి చెందిన పైనాపిల్ పంట మాత్రమే ఉంది. గత ఏడాది ప్రయోగాత్మకంగా కేరళ రకానికి చెందిన మార్షియస్ రకాన్ని ఐటీడీఏ అధికారులు పరిచయం చేశారు. ఈ రకం పైనాపిల్ సాగుతో గిరిజన రైతులు అధిక దిగుబడి , లాభాలు ఆర్జించనున్నారని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. కాగా సీతంపేటలో ఈ రకం సాగవుతుండగా.. వచ్చే ఏడాది వాటి దిగుబడి రానుంది.

### విస్తారంగా సాగు..

సింహాచలం, క్యూ రకానికి చెందిన పైనాపిల్ పంట ఎక్కువగా కుమ్మరిగండి, గుడ్డిమీదగూడ, కడగండి, గజిలి, కుసిమి, ముత్యాలు, శంభాం, జోగైనాయుడుగూడ, పెద్దగూడ, పులిపుట్టి, అక్కన్నగూడ, రాజన్నగూడ, రేగులగూడ, రేగులగూడ కాలనీ, కోతం,

(మిగతా 8వ పేజీలో...)

### పీహెచ్‌వో ఏమన్నారంటే..

సీతంపేట ఏజెన్సీలో ఒక పైనాపిల్ ధర రూ.15గా ఉంది. అయితే గిరిజన రైతులకు లాభాలు చేకూర్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఆదేశాల మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని రైతు బజార్లలో గిరిజన రైతులే నేరుగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాం. దీనికి గాను ఫార్మర్ గ్రూప్‌లకు ప్రత్యేక అనుమతి పత్రాలు అందజేస్తాం.' అని ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ఆర్‌వీ గణేష్ తెలిపారు.



## ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శనివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉచిత బస్సు సదుపాయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలో 'తల్లికి వందనం' కూడా అమలు చేయనున్నట్టు చెప్పారు. ప్రతి మారుమూల గిరిజన గ్రామానికి, కొండ శిఖర ప్రాంతాలకు పక్కా రహదారులు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో పెద్దఎత్తున సీసీ రహదారులు, కాలువలు, గోశాలలు నిర్మాణాలు జరుగుతు న్నాయన్నారు. డిపోల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం వల్ల లబ్ధిదారులు తమకు అనుకూల సమయంలో వెళ్లి రేషన్ పొందే వీలుందని తెలిపారు. కంటైనర్ ఆసుపత్రుల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. మైదాన ప్రాంతాలతో పాటు గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు.

## నేటి నుంచి డిపోల వద్దే రేషన్

- నిత్యావసర సరుకుల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

పార్వతీపురం/సాలూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి రేషన్ డిపోల వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ జరగనుంది. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్డుదారులు తమ సమీపంలోని డీలర్ వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవచ్చు. జిల్లాలో 2,76,880 రేషన్‌కార్డులున్నాయి. ఏఏవై కార్డులు 54,930 ఉన్నాయి. ఇప్పటి వరకు వాటికి 196 ఎండీయూల ద్వారా సరుకులందించేవారు. ఇకపై 578 రేషన్ డిపోల ద్వారా సరుకులం దించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో 101 డీఆర్ డిపోలున్నాయి. కొత్త విధానంలో డీఆర్ డిపోలు బలోపేతం కానున్నాయి. బియ్యంతో పాటు ఇతర సరుకులు అమ్ముడయ్యే అవకాశాలున్నాయి. ప్రతి నెలా జిల్లాలో 5 వేల టన్నుల బియ్యం, 166 టన్నుల పంచదార అందించనున్నారు.

### ఏ డీలర్ వద్ద అయినా..

కార్డుదారు నమోదైన రేషన్ షాపు వద్దే కాకుండా సమీపంలో ఉన్న ఏ డీలర్ వద్దయినా సరుకులు తీసుకోవచ్చు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వ తేదీ వరకు ఆదివారాలతో సహా డీలర్లు సరుకులందించాలి. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులందించాలి. సరుకులు పంపిణీ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. జిల్లా పౌరసరఫరాల అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు రేషన్‌డిపోలను తనిఖీ చేయాలి. లోకేషన్, డీలర్ పేరు, సరుకుల వారీగా నిల్వలు, ఈపోస్, కాటా, తూకం కచ్చితంగా ఉన్నది లేనిది తదితర అంశాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రతి నెలా ఒకటో తేది నుంచి ఐదో తేదీ నాటికి ఒంటరి దివ్యాంగులు, 65 పైబడిన వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. డీలర్లు తమ షాపులో ఆర్డీవో, తహసీల్దారు, సీఎస్‌డీటీ, పౌరసరఫరాలశాఖ, తూనికలు కొలతలు తదితర అధికారుల ఫోన్ నెంబర్లను ప్రదర్శించాలి.

### నిరంతర పర్యవేక్షణ

జూన్ ఒకటి నుంచి రేషన్‌షాపుల్లో నిత్యావసర సరుకులు అందిస్తున్న నేపథ్యంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. కార్డుదారులకు సక్రమంగా సరుకులందించాలి. అధికారుల తనిఖీల్లో ఎక్కడైనా అక్రమాలు వెలుగు చూస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- రాజేశ్వరి, మేనేజర్, ప్రజా పంపిణీ సంస్థ



## పెళ్లి పిలుపునకు వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరి మృతి
- వారిలో ఒకరు పెళ్లికొడుకు.. మరొకరు సమీప బంధువు



అచేతన స్థితిలో అప్పన్న



మృతి చెందిన రమేష్

పార్వతీపురం రూరల్, మే31 (ఆంధ్రజ్యోతి): సమీప బంధువులకు పెళ్లి పిలుపు చెప్పాలని ఎంతో ఆశతో ఆ యువకుడు ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం మండలం వచ్చాడు. తమ వారిని కలిసి సరదాగా గడిపాడు. పెళ్లికి అందరూ రావాలని కోరాడు. వారితో కబుర్లు చెప్పుకుని సంతోషంగా భోజనం చేశాడు. ఆ తర్వాత కూల్‌డ్రింక్‌లు తాగు దామని తన బంధువుతో కలిసి బైక్‌పై బయటకు వచ్చిన ఆ యువకుడిపై విధి చిన్నచూపు చూసింది. గుర్తు తెలియని వాహన రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటనలో పెళ్లికొడుకుతో సహా బంధువు కూడా మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీ రవుతున్నారు. ఈ విషాదకర ఘటన సందివలసలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా కొర్ల గ్రామానికి చెందిన ఉయ్యక రమేష్ (25) తన పెళ్లి కబురు చెప్పడానికి శనివారం సందివలస వచ్చాడు. గ్రామానికి చెందిన

(మిగతా 8వ పేజీలో...)

## నిఘా పెంచాలి.. మాదక ద్రవ్యాలు అరికట్టాలి

- అధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా పెంచి జిల్లాలో మాదక ద్రవ్యాలను అరికట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' జిల్లాలో వాహనాల తనిఖీలను మరింత పెంచాలి. మున్సిపాలిటీల్లో కనీసం ఐదు వందల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్సుల్లో కూడా అవగాహన పోస్టర్లను పెట్టాలి. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు అందించేలా చర్యలు తీసుకోవాలి. అటవీశాఖ అధికారులు కూడా ఇందులో భాగస్వాములవ్వాలి.' అని తెలిపారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ' జిల్లాలో అధికమొత్తంలో మాదక ద్రవ్యాల వినియోగం జరుగుతున్న హాట్ స్పాట్‌లను గుర్తించాం. ఆయా చోట్ల నిఘా పెంచడానికి చర్యలు చేపడుతున్నాం. క్యూఆర్ కోడ్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చి మాదక ద్రవ్యాల సమాచారం తెలుసుకుంటాం. ఇప్పటికే 21 పోలీస్ స్టేషన్ల పరిధిలో 7,841 మంది ప్రజలు పాల్గొని స్పందన అందించారు. జిల్లాలో విస్తృతంగా డ్రోన్ సర్వేలు నిర్వహిస్తున్నాం. పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక క్లబ్‌లు ఏర్పాటు చేస్తాం. జనవరి నుంచి ఇప్పటివరకు మాదక ద్రవ్యాలకు సంబంధించి 11 కేసులను నమోదు చేశాం. ఇందులో 1,875 కేజీల గంజాయి రవాణా కేసు కూడా ఉంది.' అని చెప్పారు. రవాణాశాఖ అధికారి ఎం.శశికుమార్ మాట్లాడుతూ... ' ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటివరకు 199 కేసులను నమోదు చేశాం.' అని వెల్లడించారు. జిల్లాలో పకడ్బందీగా నవోదయ రెండో దశను అమలు చేస్తున్నామని ఎక్సైజ్ శాఖాధికారులు తెలిపారు. 27 గ్రామాలను సారా రహితంగా ప్రకటించినట్లు వెల్లడించారు. 50 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. సారా తయారీకి 64 మంది బెల్లం వ్యాపారులు సహకరిస్తున్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో డీఆర్వో కె.హేమలత, ఏఎస్పీ అంకిత సురాన, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### రూ.48.42 లక్షల పరిహారం చెల్లింపు

జిల్లాలో 43 ఎస్సీ, ఎస్టీ కేసులకు రూ.48.42 లక్షలు పరిహారంగా చెల్లించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మరో 40 కేసులకు రూ.54.50 లక్షలు చెల్లించాల్సి ఉందని

(మిగతా 8వ పేజీలో...)

## 90 శాతం పింఛన్ల పంపిణీ



పార్వతీపురంలోని ఇందిరా కాలనీలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము ఇస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గరుగుబిల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం 90 శాతం మేర ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే ఈ ప్రక్రియ చేపట్టారు. శనివారం తెల్లవారుజామునే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. జిల్లాలో 15 మండలాలు, మూడు పట్టణాల పరిధిలో 1,39,111 మంది పింఛన్‌దారులు ఉన్నారు. మొదటి రోజు 1,23,075 మందికి పింఛన్ నగదు అందించారు. మొత్తంగా రూ. 59.32 కోట్లను పింఛన్ల రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. ఒక రోజు ముందుగానే పింఛన్ అందించడంతో పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు.

## మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ

8లో

## పొలం కన్నా.. పశు పోషణే మిన్న!

- ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న కొందరు రైతులు
- నేడు ప్రపంచ పాల దినోత్సవం



6లో

## ఉత్సవాలకు వేళాయే..

- నేటి నుంచి పార్వతీపురంలో ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మ తల్లుల పండుగలు

6లో

## కానిస్టేబుళ్ల ఎంపికకు నేడు ప్రధాన పరీక్ష

- విజయనగరం కేంద్రంగా నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



సాలూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపిక తుది అంకమైన ప్రధాన పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఆదివారం విజయ నగరం కేంద్రంలో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికకు 2022లో అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. 134 పోస్టుల భర్తీకి 2022 నవంబరులో నోటిఫికేషన్ ఇచ్చారు. 30 వేల మందికి పైబడి దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పోస్టులకు 2023, జనవరి 23న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. 27,870 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 9,152 మంది దేహదారుఢ్య పరీక్షకు ఎంపికయ్యారు. అయితే వారికి ఈ పరీక్షను నిర్వహించకుండా జాప్యం చేశారు. దీంతో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ మూలన పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కానిస్టేబుళ్ల ఎంపిక ప్రక్రియను పట్టాలెక్కించింది. 9,152 మందికి ఈ ఏడాది జనవరి 22 వరకు పరీక్షను నిర్వహించి 4,549 మందిని ఎంపిక చేశారు. తాజాగా ప్రధాన పరీక్ష నిర్వహించేందుకు చర్యలు చేపట్టడంతో అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## మెగా డీఎస్సీలో మరో అడుగు

- హాల్ టిక్కెట్లు జారీ



సాలూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో మరో అడుగు పడింది. పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 6 నుంచి 30 వరకు పరీక్షలు నిర్వహించ నున్నట్లు శనివారం వెల్లడించింది. కాగా అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. మొత్తంగా 18,001 మంది నిరుద్యోగ అభ్యర్థులు 31,038 దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో మున్సిపల్, జడ్పీ, ఎంపీపీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్జీటీలు 210, పాఠశాల సహాయకులు క్యాడర్‌లో తెలుగులో 14, హిందీలో 14, ఆంగ్లంలో 23, గణితంలో 8, భౌతికశాస్త్రంలో 32, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రంలో 62, పీఈటీ 63 చొప్పున మొత్తం 446 టీచర్ ఖాళీలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో ఎస్జీటీలు 60, పాఠశాల సహాయకుల క్యాడర్‌లో ఆంగ్లంలో 7, గణితంలో 25, భౌతిక శాస్త్రంలో 24, జీవశాస్త్రంలో 16, సాంఘిక శాస్త్రంలో 5 చొప్పున మొత్తం 137 పోస్టులు ఖాళీలుగా చూపించారు. మొత్తంగా 583 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీలో భర్తీ చేయనున్నారు. ఇవి కాకుండా ఉత్తరాంధ్ర పరిధిలోని డిఫరెంట్ ఏబుల్డ్ పాఠశాలల్లో టీచర్ పోస్టులు సైతం ఉమ్మడి జిల్లాలో నిరుద్యోగ ఉపాధ్యాయులకు అందుబాటులోకి వచ్చాయి.


# పొలం కన్నా.. పశుపోషణే మిన్న!

వ్యవసాయ అనుబంధ రంగాల్లో పాడి ఒక భాగం. ఒకప్పుడు గ్రామాల్లో ప్రతి ఇంట్లోనూ పాలిచ్చే పశువులు ఉండేవి. పాలు ఇంట్లో వాడకానికి పోను మిగిలినవి ఇరుగుపొరుగు వారికి ఇచ్చేవారు. కొంతమంది గ్రామాల్లోకి వచ్చే వ్యాపారులకు అమ్మేవారు. తద్వారా కుటుంబ పోషణకు, ఇతర చిన్న అవసరాలకు సరిపడా ఆదాయం పొందేవారు. ఇప్పుడు పాడి పెంపకం ఆసక్తి తగ్గిపోతోంది. గ్రామాల్లో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ ప్రభావం రైతుల జీవితాలపై పడింది. పంటల్లో నష్టం వచ్చినప్పుడు రైతులు అప్పులపాలు కావాల్సి వస్తోంది. అయితే కొందరు రైతులు ఇప్పటికీ పాడితో ఉపాధి పొందుతున్నారు. పిల్లలను చదివించుకుంటూ వారికి వివాహాలు కూడా చేస్తున్నారు. పాడిపెంపకం ద్వారా ఉపాధి పొందుతున్న కొందరు రైతుల గురించి కథనాలు..

**పిల్లల చదువులు, వివాహాలకూ ఇదే డబ్బు**

**ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న కొందరు రైతులు**

### ● ఇది తిరుపతినాయుడుగాథ


అలజంగి గ్రామానికి చెందిన తిరుపతి నాయుడు

బొబ్బిలి/రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన తిరుపతి నాయుడు పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నాడు. పశు సంవర్ధకశాఖ ద్వారా రుణం పొంది నాలుగు ఆవులు కొనుగోలు చేసి ప్రారంభించాడు. తనకున్న ఎకరా పొలంలో మేలు రకాల పచ్చగడ్డి పెంచుతున్నాడు. పచ్చిగడ్డి అందుబాటులో లేనప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పాతర గడ్డి తయారీ కోసం మొక్కజొన్నతో పాటు మేలు జాతి పశుగ్రాసాలు పెంచుతున్నాడు. ఇప్పుడు ఆయన వద్ద ఆరు ఆవులు ఉన్నాయి. తమ కుటుంబ సభ్యులే ఆవుల పోషణ చూసుకుంటారని తిరుపతినాయుడు చెప్పాడు. ఆవులు రెండుపూటలా 70 లీటర్ల పాలు ఇస్తాయని, లీటరు రూ.35 చొప్పున అమ్ముతున్నానని తెలిపాడు. నెలకు మొత్తం ఆదాయం రూ.75వేలు వస్తుందని, ఇందులో ఖర్చులు రూ.30వేలు పోను రూ.45వేలు మిగులుతోందని తెలిపాడు. పాడిపోషణ మొదలు పెట్టినప్పటి నుంచి ఆర్థికంగా నిలదొక్కుకున్నానని చెబుతున్నాడు.

### పొలం కౌలుకు ఇచ్చి..


రాజుపేటకు చెందిన నాగిరెడ్డి విజయగౌరి


బొబ్బిలి మండలం రాజుపేట గ్రామంలో నివాసముంటున్న నాగిరెడ్డి విజయగౌరి గత 15 సంవత్సరాలుగా పాడి పోషణతో జీవనం సాగిస్తోంది. 'మాకు 10 ఆవులు, 4 పడ్డలు, 4 పెయ్యిలు ఉన్నాయి. రోజుకి 50 లీటర్లు పాలు ఇస్తాయి. పాలు విశాఖడెయిరీకి పోస్తున్నాం. మాకున్న 4 ఎకరాల పొలంలో మూడు ఎకరాలు కౌలుకిచ్చేశాం. ఒక ఎకరా పొలంలో గడ్డి వేసుకున్నాం. వ్యవసాయం కన్నా ఇదే బాగుంది. పాడితోనే ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకుంటున్నాం. వ్యవసాయం చేయలేక మేము ఈ బాట పట్టాం. పాలు లీటరు 35 నుంచ 40 రూపాలయలకు అమ్ముతాం. నెలకు రూ. 25 వేలు ఖర్చు అవుతుంది. ఖర్చులు పోగా రూ. 32 వేలు మిగులుతుంది' అని విజయగౌరి తెలిపారు.

### నేడు ప్రపంచ పాల దినోత్సవం

విజయనగరం/రింగురోడ్డు, మే 31(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిఏటా జూన్ 1న పాల దినోత్సవంగా జరుపుకుంటాము. పాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ఉత్పత్తిని పెంచడంపై ప్రజలకు అవగాహన కల్పించడం ఈ దినం ముఖ్య ఉద్దేశం. ఐసీఎంఆర్ సూచనల మేరకు ఒక వ్యక్తికి సరైన పోషకాలు అందాలంటే రోజుకు 250 మి.లీ. పాలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పాడి రైతులను ప్రోత్సహించేందుకు విశాఖ డెయిరీ పాలసేకరణ యూనిట్లు ఏర్పాటుచేసింది. ప్రైవేటు డెయిరీలు సైతం యూనిట్లు ఏర్పాటు చేశాయి. కానీ రైతుల నుంచి ఆసక్తి అంతగా ఉండడం లేదు. దానికి కారణం పశుపోషణ భారం కావడమే. జిల్లాలో ప్రస్తుతం పాడి పశువుల సంఖ్య 2,60,695 కాగా.. సంతానోత్పత్తి సామర్థ్యం ఉన్న పశువులు 2,72,445 ఉన్నాయి. రోజుకు పాల ఉత్పత్తి 6,65,668 లీటర్లు జరుగుతుండగా.. ఇందులో డెయిరీలు సేకరిస్తున్నవి 3,71,885 లీటర్లు. స్థానికంగా వినియోగానికి 2,53,783 లీటర్లు. అయితే ఇప్పుడు నాణ్యమైన పాలు అన్నవి గగనంగా మారుతున్నాయి. పశుపోషణకు దాణా, పశుగ్రాసం దొరకని పరిస్థితి ఉంది.

● పాల ఉత్పత్తికి సంబంధించి రాష్ట్రంలో విజయనగరం జిల్లా ఐదో స్థానంలో ఉంది. ఐదేళ్లలో ఉత్పత్తిని 15 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో సమీకృత దాణాను రైతులకు అందిస్తోంది. జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల దాణా వస్తోంది. తొలి విడతగా 250 మెట్రిక్ టన్నులు చేరింది. ఒక్కొక్క రైతుకి 150 కిలోల లెక్కన 90 రోజులు విడతలవారీగా 450 కిలోల దాణాను అందిస్తాము. ఇందుకోసం రైతులు 555 రూపాయలు చెల్లిస్తే చాలు. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**-వైవీ రమణ, పశుసంవర్ధక శాఖ జేడీ, విజయనగరం**



### 30 ఏళ్లుగా పాడిపైనే జీవనం


పాలు విక్రయిస్తున్న పోలినాయుడు

కురుపాం రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామానికి చెందిన గుంట్రెడ్డి పోలినాయుడు నిరుపేద రైతు. గడచిన 30 సంవత్సరాలు పాడినే నమ్ముకుని జీవిస్తున్నాడు. తొలుత ఒక గేదెను పోషించుకుంటూ పాలను అమ్మి కుటుంబాన్ని పోషించుకునేవాడు. దీనిద్వారా పాడి పశువులను అభివృద్ధి చేసుకున్నాడు. ఇప్పుడు తాను స్వయంగా 50 లీటర్ల పాలను తీస్తున్నాడు. గ్రామంలో మరో 50 లీటర్లు సేకరించి మొత్తం 100 లీటర్లు కురుపాం, శివన్నపేటలో ఇంటింటికీ వెళ్లి విక్రయిస్తున్నాడు. తన ఇద్దరు కుమారులకు ఉన్నత చదువులు చదివించాడు. పెద్ద కొడుకు ప్రదీప్ హైదరాబాద్‌లో యూపీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుండగా.. చిన్న కుమారుడు ప్రవీణ్ విశాఖపట్నంలోని గాయత్రి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కుమారులు సెలవుల్లో వచ్చినప్పుడు ఇంటింటికి పాలు పోసి తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పాడి ద్వారానే తాను ఆర్థికంగా అభివృద్ధి చెందానని పోలి నాయుడు చెబుతున్నాడు.

# గొట్టివలసలో గజరాజులు

## రహదారిపైకి రావడంతో వాహనదారుల్లో ఆందోళన

గరుగుబిల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం గొట్టివలసలో గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. శుక్రవారం సంతోషపురం పంచాయతీ పిట్టలమెట్ట, ఖడ్గవలసలలో సంచరించిన ఎనిమిది ఏనుగులు నాగూరు మీదుగా మరుపెంట పంచాయతీ సాంబన్నవలసకు చేరుకున్నాయి. శనివారం మాత్రం గొట్టివలస రహదారిపైకి ఏనుగులు రావడంతో వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అటవీ శాఖ సిబ్బంది గుంపును సమీప తోటల్లోకి పంపించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఇదిలా ఉండగా గజరాజుల గుంపు సంచరిస్తున్న ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడరాదని అటవీ సిబ్బంది, ట్రాకర్లు హెచ్చరిస్తున్నారు. పంట పొలాలకు ఒంటరిగా వెళ్లరాదని గ్రామాల్లో దండోరా వేయిస్తున్నారు.


గొట్టివలస ప్రధాన రహదారిపైకి వచ్చిన గజరాజుల గుంపు

# ఉత్సవాలకు వేళాయె..

- నేటి నుంచి ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మ తల్లుల పండుగలు ప్రారంభం
- ఉయ్యాల కంబాలకు సర్వం సిద్ధం
- 2న తొలేళ్లు, 3న సిరిమానోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఉత్సవ కమిటీ
- పార్వతీపురంలో సందడే సందడి


విద్యుద్దీపాలంకరణలో యర్రకంచమ్మ ఆలయం

పార్వతీపురం టౌన్, మే 31(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉత్సవాల సందడి ప్రారంభమైంది. పట్టణం, జగన్నాథపురం, బెలగాం ప్రజల ఇలవేల్పులు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ, బంగారమ్మ తల్లుల పండుగలు నేటి నుంచి నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ఇప్పటికే అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎవరికీ ఎటువంటి కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం నాయుడువీధిలోని ఇప్పలపోలమ్మ ఆలయ సమీపంలో రెడ్డి వీధిలో, జగన్నాథపురం యర్రకంచమ్మ ఆలయం వద్ద ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించ నున్నారు. ఇప్పలపోలమ్మ, యర్ర కంచమ్మల పండుగుల సందర్భంగా సోమవారం తొలేళ్లు, మంగళవారం అమ్మవార్ల సిరిమానుత్సోవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు.

**సిరిమానులు సాగేదిలా...**

ఇప్పలపోలమ్మ సిరిమానును పూజారి ఆరిక రాజారావు, యర్రకంచమ్మ సిరిమానును నక్కా వాసు అధిరోహిస్తారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య ఇప్పలపోలమ్మ సిరిమానుకు పూజలు చేస్తారు. అనంతరం పూజారి రాజారావు సిరిమానును అధిరోహిస్తారు. నాయుడు వీధిలోని ప్రధాన ఆలయం నుంచి ఇప్పలపోలమ్మ సిరిమాను ప్రారంభమవుతుంది. భాను ప్రసాద్ ఆసుపత్రి నుంచి టౌన్ పోలీసు స్టేషన్‌వీధి, నాలుగు రోడ్ల కూడలి, ప్రధాన రహదారి మీదుగా వెంకటేశ్వర కళామందిర పాతబస్టాండ్ వరకు సిరిమాను వెళ్తుంది. పాత బస్టాండ్ నుంచి దంగిడివీధి నుంచి మళ్లీ టౌన్ పోలీసు స్టేషన్‌వీధి, నాలుగు రోడ్ల కూడలి (కుడివైపు) మీదుగా గాంధీ సత్రం వరకు సాగుతుంది. పద్మశ్రీ థియేటర్‌లోని వనంగుడి వద్ద ఘటాలకు పూజలు చేస్తారు. ఆతర్వాత అనుపోత్సవం ప్రారంభమవుతుంది.

● జగన్నాథపురం యర్రకంచమ్మ ఆలయం వద్ద సిరిమానును అధిరోహించే పూజిరి నక్కా వాసుదేవరావు ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి 7 గంటల మధ్యలో పూజారి సిరిమానును అధిరోహిస్తారు. అమ్మవారి ఆలయం నుంచి కొత్తవీధి, రాయగడ రోడ్డు, పాతబస్టాండ్ , టౌన్ పోలీసుస్టేషన్ వీధి ,తెలకల వీధి, కుసుమగుడ్డి వీధి కూడలి, కంచరవీధుల మీదుగా తిరిగి అమ్మవారి గుడి వరకు సిరిమానుత్సోవం సాగుతుంది.

# టీడీపీతోనే పేదల సంక్షేమం

- 12న స్పౌజ్ కోటా పింఛన్ల పంపిణీ
- 'అన్నదాత సుఖీభవ' రైతు ఖాతాకు రూ.20 వేలు
- ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ మంత్రి శ్రీనివాస్


శివరామరాజుపేటలో పింఛన్ అందిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, మే 31 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటా పింఛన్లను ఈనెల 12న సుమారు లక్ష మందికి పైబడి అందించేందుకు సిద్ధం చేసినట్లు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని చెప్పారు. మండలంలోని శివరామరాజుపేటలో స్థానిక శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి, ఎంపీపీ సండి సోమేశ్వరరావు, సర్పంచ్ కోట్యాడ ఝాన్సీలతో కలిసి శనివారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక పింఛన్ పొందుతున్న భర్త చనిపోయిన వెంటనే వారి భార్యలను ఈ పింఛన్ తక్షణమే మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.ఈ పింఛన్లను ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తవుతున్న సందర్భంగా పంపిణీ చేయనున్నామన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు పేద కుటుంబాలకు ఆసరాగా ఉంటుందని వృద్ధులకు సామాజిక పింఛన్ల పథకాన్ని అమల్లోకి తీసుకొస్తే, ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అవసరాలకు అనుగుణంగా పింఛన్‌ను పెంచుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఆగస్టు ఒకటో తేదీ తరువాత అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతు ఖాతాలో రూ.20 వేలు జమవుతాయన్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో రూ.120 కోట్లు ఉపాధి హమీ పథకం నిధులతో రోడ్లు నిర్మాణం జరుగుతోందన్నారు. విశాఖ-అరకు ప్రధాన రహదారి విస్తరణ పనులు భూసేకరణ వల్ల ఆలస్యం అవుతున్నాయన్నారు. యువత ఉపాధి అవకాశాల కోసం ఎంఎస్‌ఎంఈ, ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు చుట్టుపక్కల పారిశ్రామికీకరణ జరిగేలా చూస్తున్నామన్నారు. బ్యాంకుల నుంచి మహిళలు సులభతరంగా డ్వాక్రా రుణాలు పొందేందుకు అవసరమగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ శివరామరాజు పేట గ్రామానికి రూ.120 కోట్లుతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు సహకరించాలని సర్పంచ్ కోట్యాడ ఝాన్సీ, కోట్యాడ జగదీష్‌లు కోరారు. కార్య క్రమంలో రాష్ట్ర టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, రాయవరపు చంద్రశేఖర్, జీఎస్.నాయుడు, రెడ్డి వెంకన్న, కొణదం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, చెక్క కిరణ్, పెదగాడి రాజు, మోపాడ చిన్ని కృష్ణ, కనిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

**విజయనగరం జిల్లాలో ఎమ్మెల్యేలు పింఛన్లు పంపిణీ చేశారు. పేదలను ఆదుకునేది కూటమి ప్రభుత్వమేనని లబ్ధిదారులకు తెలియజేశారు.**


రేగిడి: బూరాడలో పింఛన్ పంపిణీచేస్తున్న రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి


మెరకముడిదాం: గర్భాంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు


విజయనగరం రింగురోడ్డు: దివ్యాంగునికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

# పేదల ముఖంలో ఆనందమే లక్ష్యం

● మంత్రి సంధ్యారాణి ● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


సాలూరులో పింఛన్ డబ్బులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి

సాలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): పేదల ముఖంలో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం ఆమె సాలూరులోని పలు వార్డుల్లో పర్యటించి, ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. 1వ వార్డులో అనారోగ్యంతో మంచానికే పరిమితమైన శ్రీనివాసరావును, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ప్రతినెలా రూ.15వేలు పింఛన్ అందుకోవాలని సూచించారు. అనంతరం 4, 5 వార్డుల్లో ఉన్న పలువురు దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు పింఛన్లు అందజేశారు. అనంతరం ఆమె ఐదో వార్డులో మాట్లాడారు. జూన్ నెలలో విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వారి ఖాతాల్లో నేరుగా జమవుతుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తామన్నారు. అలాగే ఉచిత గ్యాస్ పథకానికి సంబంధించి మహిళలు గ్యాస్ వాడినా, వాడకపోయినా వారి ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు జమవుతాయని ఆమె తెలిపారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా 4, 5 వార్డు ప్రజలతోపాటు పట్టణ ప్రజలు తనకు ఎనలేని ఘన విజయాన్ని చేకూర్చడం తన జీవితంలో మరచిపోలేనని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కొనిశి చిన్ని, వరలక్ష్మి, కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



వర్షానికి కొట్టుకుపోయిన మారిక తారురోడ్డు

# ప్రణాళిక లేక.. పర్యవేక్షణకు నోచుకోక

● రాకపోకలకు గిరిజనులకు తప్పని అవస్థలు ● వర్షాలకు కొట్టుకుపోయిన వైనం ● మూణ్నాళ్ల ముచ్చటగా మారిక రోడ్డు

వేపాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మారిక కొండపైకి రహదారి నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోపాటు ప్రణాళికబద్ధంగా వ్యవహరించపోవడంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. నాణ్యత ప్రమాణాలు పాటించపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయింది. నిర్మాణంలో కనీస జాగ్రత్తలు, నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కొండపై భాగంగా నుంచి వచ్చే వర్షం నీటికి రోడ్డు పూర్తిగా కోరుకుపోతుందని తెలిసినా అధికారులు నిరక్ష్యంగా వ్యవహరించారని మారిక గిరిజనులు వాపోతున్నారు. దీంతో రాకపోకలకు మళ్లీ అవస్థలు తప్పడంలేదని చెబుతున్నారు.ఎటువంటి సాంకేతకపరిజ్ఞానం లేని రోజుల్లో ఎంతో పటిష్టంగా రోడ్లు వేయగా, ఇప్పుడు అన్నివిధాల సాంకేతికనైపుణ్యంతోపాటు యంత్రాలుఅందుబాటులోకి వచ్చినా ఎందుకు పటిష్టంగా రోడ్డు నిర్మించలేకపోయారని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపుల కాలువలు నిర్మించి నీరు మళ్లించేందుకు వీలుగా ఎక్కడికక్కడ మదుములు, కల్వర్టులు ఏర్పాటుచేస్తే తక్షణమే కొట్టుకుపోయే అవకాశముండేదికాదని పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో నడిచేందుకు సైతం అవకాశం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడతారు రోడ్డుతో పాటు మెటల్ రోడ్డు కూడా పూర్తిగా పాడవడంతో కొండపై నుంచి కిందికి దిగడానికి గిరిజనులు ఇబ్బందిపడుతున్నారు.ఈనేపథ్యంలో శనివారం గ్రామానికి చెందిన కిలోఅర్జున్ అనారోగ్యానికి గురికావడంతో కొండపై నుంచి కింద ఉన్న ఆస్పత్రికి తరలించేందుకు అవస్థలు పడాల్సి వచ్చిందని పలువురు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వారంతా కోరుతున్నారు.

# సారా రహిత జిల్లాగా విజయనగరం

● నవోదయం 2.0 జిల్లా కమిటీలో తీర్మానం

● బెల్టుషాపులను నియంత్రించాలి : కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం క్రైం, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, మండలాలను సారాలేని గ్రామాలుగా గుర్తించి విజయనగరం జిల్లాను సారా రహిత జిల్లాగా ప్రకటిస్తూ నవోదయం-2.0 కమిటీలో తీర్మానించినట్లు కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. దీంతో నవోదయం-2.0 లక్ష్యం నెరవేరిందని తెలిపారు. శనివారం నవోదయం-2.0 అమలుపై కలెక్టరు అంబేడ్కర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇదే ఒరవడితో ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోసారా తయారీ గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో తయారీలో నిమగ్నమైన వారిని బైండోవర్ చేయడం, సారా తయారీకి సహకరిస్తున్న బెల్లం వర్తకులు, బెల్లం సరఫరా చేయకుండా నిరోధించడం ఆయా గ్రామాల్లో సారాతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం వంటి చర్యలతో జిల్లాలో సారా తయారీని పూర్తిగా నిరోధించగలిగామని చెప్పారు. భవిష్యత్తులో జిల్లాలో ఎక్కడ సారా తయారీ జరగకుండా ఎక్సైజ్ శాఖ నిరంతరం ఆయా ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో బెల్ట్‌షాపులు అధికంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిని విచ్చలవిడిగా ఏర్పాటు చేయకుండా నియంత్రించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.అవసరమైతే, తాను కొన్ని ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరిడెంటెంట్ బి.శ్రీనాథుడు మాట్లాడుతూ జిల్లాలో సారా తయారీ చరిత్ర గల వ్యక్తులు, గ్రామాలను గుర్తించి వారి జాబితాను రూపొందించి, బైండోవర్ చేశామని వివరించారు. జిల్లాలోని 27 మండలాల్లో 771 రెవెన్యూ గ్రామాల పరిధిలో 26 సారా ప్రభావిత గ్రామాలు గుర్తించామని, 414 పాత ముద్దాయిలు, 26 బెల్లం వర్తకులను గుర్తించి బైండోవర్ చేశామని కలెక్టరు అంబేడ్కర్‌కు వివరించారు. అనంతరం పదవి విరమణ పొందిన డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీఎన్ బాబ్జీరావును కలెక్టరు అంబేడ్కర్ సత్కరించారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ డీసీ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు, సహాయ సూపరిడెంటెంట్ దొర, డీఎంహెచ్‌ఓ జీవనరాణి, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

## సాగు నీటి కాలువలకు నిధుల మంజూరు

గజపతినగరం, మే 31(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు నీటి కాలువల అభివృద్ధికి కోటి 66 లక్షలు మంజూరయ్యాయని ఆంధ్ర ప్రాజెక్టు ఛైర్మన్ కోడి సతీష్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో సాగు నీటికి భరోసాఏదీ శీర్షికతో గతనెల24న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టి సారించారని చెప్పారు. గజపతినగరం, బొండపల్లి మండలాలకు సంబంధించి సుమారు 40 వేల ఎకరాలపైబడి సాగు నీరందించే దిశగా చర్యలు తీసుకున్నామని, అందుకు అవసరమైన నిధులు ఇరిగేషన్ శాఖకు మంజూరుచేస్తున్నట్లు చెప్పారు. గజపతినగరం మండలంలోని ఎంఎస్‌చానల్, బీవీ చానల్ కాలువులకు సంబంధించి 50 లక్షల రూపాయలు మంజూరు చేయడంతోపాటు 30 లక్షలతో రెండు కాలువులకు మర మ్మతులు చేపట్టేదిశగా అధికారులకు ఆదే శాలు జారీచేసినట్లు తెలిపారు. బీవీ చానల్‌కు సంబంధించి పట్రువాడ వద్ద చంపావతి నది నీరు కాలువలోకి మళ్లించేందుకు 90లక్షలతో వాల్‌నిర్మాణం, 13 వంతుల కాలువ ఆధునికీకరణతో పాటు మరమతులకు సంబంధించి 26 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు.

## గ్రావెల్ తవ్వకాలపై విచారణ

శృంగవరపుకోట రూరల్,మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరనారాయణం, కొండమల్లిపూడి ప్రధాన రహదారిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై జిల్లా మైన్స్‌శాఖ అధికారులు విచారణ నిర్వహించారు. అక్రమ గ్రావెల్ తవ్వకాల శీర్షికతో ఈనెల21న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో మైన్స్‌శాఖఅధికారులు శనివారం వీఆర్‌వో, అటవీశాఖ అధి కారులతో కలిసి పరిశీలించారు. ఇక్కడ తవ్వకాలు స్థానికంగా ఉండే ఇటుక బట్టీలవారు చేస్తున్నట్లు, ఇటుకబట్టీ ఏర్పాటుకుస్థలం చదునుచేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ అక్రమ ఖనిజ తవ్వకాలు నిరోధంపై తమ శాఖ నిరంతర గస్తీ నిర్వహిస్తోందని, తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాయితీపై పశువుల దాణా

గజపతినగరం, మే31 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు ఉన్న రైతులకు 50శాతం రాయితీపై పశుదాణా అందజేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ బచంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 500 బ్యాగ్‌లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 50 కేజీలు పశుదాణా రూ.1,100 ధర కాగా 50శాతం రాయితీపై రైతులు రూ.550 తమ ఫోన్‌ద్వారా నగదు చెల్లిస్తే పశుదాణా పంపిణీచేయనున్నట్లు తెలిపారు.

## నేడు, రేపు విగ్రహాల ప్రతిష్ఠ

వేపాడ,మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాకేరులో ఆది, సోమవారాల్లో గుండాలమ్మ,పైడమ్మతల్లి, శ్రీకృష్ణ స్వామిల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్మాణ కమిటీ సభ్యులు బుద్ద చిన్నమ్మలు, బుద్ద అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ప్రత్యేక పూజలు, యజ్ఞయాగాదులు, ఊరేగింపు, తప్పెటగుళ్ల ప్రదర్శన, రైవాడ మహిళలతో చిరతల భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండోరోజు ప్రతి ష్ఠ కార్యక్రమం, కృష్ణా రుక్మిణి కల్యాణం జరగనున్నట్లు పేర్కొన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలి

విజయనగరం కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి):పశువుల అక్రమరవాణాపై నిఘా పెట్టాలని విజయనగరం ఆర్డీవో సవరమ్మ ఆదేశించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలోని ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ పాల్గొన్నారు.





విజయనగరం రింగురోడ్డు:ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో



కొత్తవలస: పొగాకు వ్యతిరేక ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

## పొగాకుతో క్యాన్సర్ వ్యాధులు: డీఎంహెచ్‌వో

విజయనగరం రింగురోడ్డు, మే 31 ( ఆంధ్రజ్యోతి): పొగాకు తాగడం వల్ల అనేక దుష్ప్రభావాలతోపాటు ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధులు వచ్చే అవకాశముందని డీ ఎంహెచ్‌వో ఎస్.జీవనరాణి హెచ్చరించారు. శనివారం విజయనగరంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి కె.రాణి, జిల్లా టీబీ నివారణాధికారి కుమార్, ఎస్.సూర్యనారాయణ, పీఓఎస్ సీడీ డాక్టరు వీవీ సుబ్ర హ్మణ్యం, ఎఫ్ఎల్‌ఓ రమణి, డెంటల్ హెచ్‌ఓడీ జనార్దన్, కామేశ్వరరావు, పాల్గొన్నారు.

●నెల్లిమర్ల,మే 31(ఆంధ్రజ్యోతి):పొగాకు ఉత్పత్తుల వినియోగానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని రెడ్‌క్రాస్ జిల్లా వైద్యాధికారి వేణుగోపాలరెడ్డి సూచించారు. మండలంలోని రామతీర్థంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మిమ్స్‌గ్రామీణ వైద్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వేణుగోపాలరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మిమ్స్ గ్రామీణ వైద్య కేంద్రం వైద్యులు షణ్ముఖ, వాహిని, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్, మన్మథరావు పాల్గొన్నారు

● కొత్తవలస, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకానికి దూరంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాల కృష్ణ కోరారు. వియ్యంపేటలో వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహారావు, జగదాంబ, పద్మావతి, ఈశ్వరరావు, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారం: ఎమ్మెల్యే

రాజాం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు.శనివారం రాజాం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 50 వరకు వినతులు స్వీకరించారు. రాజాం తెలుగుదేశంపార్టీ కార్యాలయం ఉద్యోగి యందవ వినోద్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయన ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పిన్నింటి మోహన్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, శాసపు రమేష్‌కుమార్, దూబ ధర్మారావు, శ్రీను అంపోలు శ్రీను, నాగార్జున, పిల్లా సత్యంనాయుడు, మరిపి జగన్మోహన్ పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

విజయనగరం దాసన్నపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం విమర్శించారు. శనివారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 66,363 పేపర్ల మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకున్నారని, 11 వేలకుపైగా పేపర్లకు సంబంధించి విద్యార్థులకు ఉత్తీర్ణత, మార్కులు మార్పు అయ్యామన్నారు. ప్రభుత్వం తొందరపాటు చర్యలతో వేలాది మంది విద్యార్థుల జీవితాలపై ప్రభావం పడిందన్నారు. చాలామంది విద్యార్థులు ఫెయిల్‌కావడంతో మార్కులు కూడా తక్కువగా వచ్చాయని తెలిపారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు గౌరీశంకర్, సుమన్, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

## 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

మెరకముడిదాం, మే 31(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి నియోజకవర్గం స్థాయిలో ఈనెల నాలుగో తేదీన నిర్వహించే వెన్నుపోటు దినం కార్యకర్తలు, నాయ కులు విజయవంతం చేయాలని జిల్లా వైసీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం మెరకముడిదాంలో వైసీపీ మండలాధ్యక్షుడు కోట్ల వెంకటరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోనాయకులు తాడ్డి వేణుగోపాలరావు, బూర్లె నరేష్, కే.శివరామకృష్ణ, పి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

రాజాం, మే 31 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు గుర్తింపు కార్డులకు వీఆర్వోలకు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు శనివారం పేర్కొన్నారు. మండలంలోని కౌలురైతులకు గతంలో 500 గుర్తింపు కార్డులు జారీచేసినట్లు పేర్కొన్నారు.ఖరీఫ్‌సీజన్ ప్రారంభంకానుండడంతో రైతులకు అవసరమైన విత్తనాలు, బ్యాంకు రుణాలు పొందాలంటే గుర్తింపు కార్డులు అవసర మని తెలిపారు.

## ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

విజయనగరం రింగురోడ్డు, మే 31 ( ఆంధ్రజ్యోతి):విజయనగరంలోగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ 83వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఎన్‌సీఎస్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమాన సంఘ కుటుంబాలకు ఉన్నత చదువుల కోసం ఉపకార వేతనాలు అందజేస్తున్నట్టు జిల్లా కృష్ణ, మహేష్ కల్చరల్ సేవా సంఘం అధ్యక్షుడు అరవింద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు సరిత, శ్రీను, జగదీష్, అహ్మద్, భార్గవ్, కాండ్రేగుల శేఖర్, థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో 94.23 శాతం పింఛన్ల పంపిణీ

విజయనగరం కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను 94.23 శాతం శనివారం ఒక్కరోజే పంపిణీచేశారు. జిల్లా వ్యాప్తంగా 2,71,532 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా 2,55,862 మందికి అందజేశారు.

## నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మంత్రి శ్రీనివాసరావును ఆహ్వానిస్తున్న శిష్టకరణ సంక్షేమ సంఘ సభ్యులు

విజయనగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కేఎల్‌పురం కమ్యూనిటీ పంక్షన్ హాలులో ఆదివారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర స్థాయిలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 85శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా శిష్టకరణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు జిల్లా శిష్టకరణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును పురస్కారాలను ప్రదానం చేయడానికి ఆహ్వానించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వి.వెంకటేష్, మధుసూదనరావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## దావాలపేటలో మహంకాళి అమ్మవారి పండుగ

గజపతినగరం మే31(ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాలపేటలో మహంకాళి అమ్మవారి పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మూడురోజులు నిర్వహించే పండుగకు సంబంధించి గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. శనివారం తొలేళ్ల ఉత్సవం, ఒకటో తేదీన ఘటాల ఊరేగింపు, రెండో తేదీన కనుమ జరుపుకోనున్నారు.

### కొటారుబిల్లిలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

గంట్యాడ,మే31 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొటారుబిల్లి కనకదర్గమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహప్రతిష్ఠ శనివారం కన్నుల పండువగా జరిగింది. అమ్మవారిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు కేఏనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, నాయకులు కొండపల్లి భాస్కర్ నాయుడు, అల్లు విజయకుమార్, పీరుబండి జైహింద్ కుమార్ దర్శించుకున్నారు.

●గుర్ల, మే 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని గేదెలపేటలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఈ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు శనివారం పూజల్లో పాల్గొన్నారు.

### ఆంజనేయస్వామి ఆలయానికి విరాళం

విజయనగరం దాసన్నపేట, మే 31 ( ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ప్రేమ సమాజంలో కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులకు వస్త్రాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పాత బస్టాండ్‌లోని అంజనేయ స్వామి ఆలయానికి రూ.10 వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ కనకల రఘురామారావు మాట్లాడుతూ 20 ఏళ్లగా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయుడు, పుష్పకుమార్ రెడ్డి, మధు, కొండలరావు, రవి, గిరి, వెంకటేష్, రాంబాబు, పైడిరాజు పాల్గొన్నారు.

## విజయనగరంలో భారీ వర్షం

విజయనగరం కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రైల్వే అండర్ బ్రిడ్జి, సిటీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో నడుమ లోతులో నీరునిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

● వేపాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్ర, శనివారాల్లో కురిసిన భారీ వర్షాలకు నువ్వు పంట పొలాల్లో నీరు చేరింది. పలుచోట్ల ఎగువన ఉన్న పొలాల నుంచి వరద రావడంతో పంట నీట మునిగి పోయాయి. నీరు ఎక్కువ రోజులు నిల్వఉంటే పంట కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం నీరు బయటకు వెళ్లేలా రైతులు కాలువలు తీసినా ప్రయోజనం లేకుండాపోయింది.మరో పది పదిహేను రోజుల్లో చేతికి పంట వస్తుందన్న సమయంలో కురిసిన వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



విజయనగరం కలెక్టరేట్: రైల్వే బ్రిడ్జి వద్ద నడుము లోతు నీరుచేరిన దృశ్యం



వేపాడ: నువ్వు పొలంలో చేరిన వర్షం నీరు

## మాటు వేసి.. నిందితులను పట్టుకుని

● గంజాయి కేసును ఛేదించిన పోలీసులు

రేగిడి, మే 31, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడమెట్ట పరిసరాల్లో మేనెల 28న గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముగ్గురిని దర్యాప్తు నిర్వహించి, ఆ కేసుకు సంబంధించిన మూలలను రాజాం సర్కిల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు వీరఘట్టాంకు చెందిన బండి సంజయ్, మరో 17 ఏళ్ల బాలుడు సంకిలి పరిసరాల్లో రెండున్నర కిలోల గంజాయితో శనివారం పట్టుబడ్డారు.రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరరావు, రేగిడి ఎస్ఐ నీలావతి శనివారం విలేకరులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట పరిసరాల్లో మే 28న పోలీసుల తనిఖీలో అక్కన్న అగ్రహారం,వన్నలి గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదుచేసి అదుపులో తీసుకొన్నారు. పట్టుబడిన వారికిమాదకద్రవ్యాలు ఎవరు సరఫరా చేస్తున్నారు, ఎక్కడనుంచి సరఫరా అవుతుందన్న కోణంలో విచారించారు.అనంతరం మాటువేసి అసలు నిందితులు పట్టుకున్నారు. నిందితుల్లో సంజయ్‌పై పోక్సోకేసు, సారా, గృహహింస కేసు ఉండగా,బాలుడిపై దొంగతనం కేసులు ఉన్నారు. సమాచారం మేరకు రేగిడి, సంతకవిటి మండలాల్లో పలుగ్రామాలకు గంజాయి సరఫరా చేస్తున్నటు, వీరు కురుపాంనుంచి గంజాయి తెచ్చి ఈప్రాంతంలో అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడ మూలాలను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నారు.ఈ మేరకు ఇద్దరి నిందితులను అరెస్టుచేశారు.

## మంగళపాలెం చోరీ కేసు ముమ్మర దర్యాప్తు

కొత్తవలస, మే 31 (ఆంధ్రజ్యోతి): మంగళపాలెంలో ఇటీవల జరిగిన చోరీకి సంబంధించిన కేసును పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం ఎస్పీ వకుల్ జిందాల్ గురుదేవ ఆసుపత్రిలో విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు, కొత్తవలస, శృంగవరపుకోట సీఐలు షణ్ముఖరావు, వేచలపు నారాయణమూర్తి, ఎస్ఐలు నవీన్ పడాల్, సుదర్శనరావులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కొంతమంది స్థానికంగా ఉన్న వారిని అనుమానించి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి దర్యాప్తుచేశారు. ముందస్తు పథకం ప్రకారమే సీసీ కెమెరా పనిచేయకుండా చేశారన్న అనుమానం వ్యక్తం కావడంతో ఆ దిశగా దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో శనివారం సాయంత్రం జిల్లా అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావుతోపాటు సీఐలు షణ్ముఖరావు, నారాయణమూర్తి వివిధ పోలీసుస్టేషన్లకు చెందిన ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. మంగళపాలెం గ్రామంలోని గురుదేవ చారిటబుల్‌ట్రస్టు ఛైర్మన్‌రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో మంగళవారం రాత్రి జరిగినచోరీలో సుమారు 90 తులాల బంగారు అభరణాలతో పాటు రూ.ఐదు లక్షల నగదు చోరీకి గురైన విషయం విదితమే.

## రాయపాలెం డౌన్‌లో ఆటో బోల్తా

శృంగవరపుకోట రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పల్లపుదుంగాడ నుంచి మైదాన ప్రాంతం దబ్బగుంటకు వస్తున్న ఆటో రాయపాలెం డౌన్ శనివారం బోల్తాపడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.ఈవిషయం తెలుసుకున్న సమీప గ్రామాల గిరిజన యువకులు చేరుకొని ఆటోను పైకి లేపారు. ఆ సమయంలో ఆటో రవి ఒక్కరే ఉన్నారు.

**నూర్పిడి యంత్రం...**

వంగర, మే 31 (ఆంధ్రజ్యోతి):మగ్గూరులో శనివారం నూర్పిడి యంత్రం బోల్తాపడింది. గ్రామ సమీపంలో మొక్కజొన్న నూర్పిడికి రైతుయంత్రాన్ని తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి పడిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్ పైనుంచి దూకేయడంతోప్రమాదంతప్పింది. ప్రధాన రహదారిలో నూర్పిడి యంత్రం బోల్తాపడడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది.

## ఆటో డ్రైవర్‌కు గాయాలు

విజయనగరం క్రైం, మే 31 ( ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పూల్‌బాగ్ రోడ్డులో కారు, ఆటో ఢీ కొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. చీపురుపల్లి నుంచి దాసన్నపేట రైతు బజార్‌కు కూరగాయాలు లోడ్‌తో వస్తున్న ఆటోను, కారుఢీ కొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ శివకు తీవ్ర గాయాలయ్యాయి. పలువురికి స్వల్ప గాయాలయ్యాయని టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. తీవ్ర గాయాలైన ఆటో డ్రైవర్ శిను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వీవీఆర్‌పేటలో ఏనుగుల సంచారం

వంగర, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీఆర్‌పేటలో మళ్లీ ఏనుగులు ప్రవేశించాయి.కొన్నాళ్లగా నాగావళి తీరంలోని గరుగుబల్లి, వీరఘట్టాం, వంగర మం డలాల్లో తిష్ఠవేసిన గజరాజులు శనివారం వేకువజామున వీవీఆర్‌పేట,రాజుల గుమ్మడ పంటపొలాల్లో సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.బీట్ అధి కారులు దాలినాయుడు, కేశవులు సిబ్బందితో గ్రామాల్లో ప్రజలకు అప్రమత్తం చేశారు.

## విపత్తులు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

నెల్లిమర్ల, మే 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రానున్న మూడు నెలల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో విపత్తులను ఎదుర్కోనేందుకు ఉద్యోగులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ బి.సుదర్శనరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ఆ తర్వాత చేపట్టాల్సిన చర్యలపై సన్నద్ధంగా ఉండాలని కోరారు. వీఆర్వోలు తమ రెవెన్యూ గ్రామంలో సమీక్షించి, నివేదికలను అందజేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో చెరువులు, కాలువలకు ఎక్కడా గండి పడకుండా చూడాలని సూచించారు. మండల స్థాయిలో తనతో పాటు ఎంపీడీవో, నీటి పారుదల శాఖ ఏఈ కమిటీగా ఉంటామని తెలిపారు. గండి పడే అవకాశం ఉన్నచోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విజయనగరం క్రైం, మే 31(ఆంధ్రజ్యోతి):న్యాయ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ కోరారు.శనివారం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.బబిత ఆదేశాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిప్రదేశంలో మహిళలకు లైంగిక వేధింపులపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, నిరోధక చట్టం -2013 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## ఇళ్ల పనులు ప్రారంభించాలి

గంట్యాడ, మే 31(ఆంధ్రజ్యోతి): ఇళ్ల పనులు తక్షణమే ప్రారంభించాలని గృహ నిర్మాణశాఖ జనరల్ మేనేజరు వెంకటరమణ కోరారు.శనివారం మండలంలోని మదనాపురం, డికెపర్తి గ్రామాల్లో పర్యటించి గతంలో మంజూరైన ఇళ్లలబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్లనిర్మాణానికి ప్రభుత్వం అదనపు సాయం అందించినా ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించా రు.మంజూరైన ఇళ్లను వెంటనే పూర్తిచేయకపోతే రద్దుచేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు పీడీ మురళి మోహన్, ఏఈ రాజగోపాల్ ఉన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి
- ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

గుమ్మలక్ష్మీపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని కొండవీధిలో శనివారం ఆమె పలువురు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాడి సుదర్శనరావు, ఎంపీడీవో సాల్మన్‌రాజ్, కూటమి నాయకులు పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: నర్సిపురం గ్రామంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ గొట్టాపు గౌరీ, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటరమణ, తవిటినాయుడు పాల్గొన్నారు. ● పార్వతీపురం: పట్టణంలోని ఇందిరాకాలనీలో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. పలువురికి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో రూ.59.32 కోట్లు పింఛన్లరూపంలో పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

### కిడ్నీ బాధితునికి పింఛన్ మంజూరు

పాలకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): జంపరకోట గ్రామంలో ఆరిక వసంతకుమార్ అనే వ్యక్తి గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ ట్రీట్మెంట్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పందించి, రూ.10వేలు పింఛను మంజూరు చేయించారు. శనివారం ఈ పింఛన్‌ను కూటమి నాయకులు అందజేశారు. కూటమి నాయకుడు వేణువు అనీల్‌కుమార్, ఎంపీటీసీ ప్రతినిధి నిమ్మక ప్రసాద్, వేణువు భీమలింగం, పుట్ట శ్రీను, మూటక చంద్రరావు పాల్గొన్నారు.

# ఇక్కడ 15.. అక్కడ 35

(5వ పేజీ తరువాయి)

ఆడలి, కోడిశ, రామానగరం, తొత్తడి, అంటికొండ, తురాయిమానుగూడ, తలైబు గూడ, నీలంగూడ, వలగజ్జి, వంబరెల్లి తదితర గిరిజన గ్రామాల్లో విస్తారంగా పండుతోంది. ప్రధానంగా ఈ సీజన్‌లో ఒడిశాతో పాటు విశాఖపట్నం, అమలాపురం, తుని, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకు ఈ ప్రాంత పైనాపిల్‌ను వ్యాపారులు ఎక్స్‌పోర్ట్ చేస్తారు. అక్కడ ఒక్కో పండును రూ.35 వరకు విక్రయిస్తారు. దోనుబాయి, సీతంపేట ,కుసిమి, మర్రిపాడు, పొల్ల వంటి ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో గిరిజన రైతుల నుంచి మైదాన ప్రాంత వ్యాపారులు కారుచౌకగా పైనాపిల్‌ను కొనుగోలు చేసి మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.

### గిట్టుబాటు అయ్యేలా..

ఈ సీజన్‌లో గిరిజన రైతులు తీసుకువచ్చే పైనాపిల్ పంటకు ఐటీడీఏ ద్వారా గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. గతంలో పైనాపిల్ పంటను ఐటీడీఏ, జీసీసీ సమన్వయంతో గిట్టుబాటు ధర ప్రకటించేవి. అధికారులు నిర్ణయించే ధరకే మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకునేవారు. ఈఏడాది కూడా ఆ విధంగానే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### రైతులను ఆదుకోవాలి

ఈ ఏడాది ఒక పైనాపిల్ ధర రూ.15 మాత్రమే పలుకుతోంది. ఈ ధర పెంచే విధంగా ఐటీడీఏ చర్యలు తీసుకోవాలి. పంట నిల్వ చేసుకునేందుకు అవకాశం లేని కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో మైదాన ప్రాంత వ్యాపారులకు అతితక్కువ ధరకు విక్రయించాల్సి వస్తోంది. గిరిజన రైతులను ఆదుకునే విధంగా అటవీ ఉత్పత్తులు, పైనాపిల్ పంటకు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలి.

- సవర మొఖలింగం, కుమ్మరిగండి

## పెళ్లి పిలుపునకు వచ్చి..

# తిరిగిరాని లోకాలకు

(5వ పేజీ తరువాయి)

తన మేనమామ పి.అప్పన్న (50)ను కలిశాడు. తన వివాహానికి కుటుంబ సమేతంగా తప్పనిసరిగా రావాలని కోరాడు. అనంతరం వారంతా కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. కూల్‌డ్రింక్‌ల కోసమని సందివలస నుంచి డీకేపట్నంకు బైక్‌పై మేనమామతో కలిసి రమేష్ బయల్దేరాడు. అయితే తిరుగు ప్రయాణంలో ఊహించని ప్రమాదం జరిగింది. డీకేపట్నం సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం వారి బైక్‌ను బలంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో రమేష్ సంఘటనా స్థలంలో మృతి చెందాడు. కొన ఊపిరితో ఉన్న అప్పన్నను స్థానికులు గుర్తించి హుటాహుటిన డోకిశిల పీహెచ్‌సీకి తరలించారు. బలమైన గాయాలు కావడంతో అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అప్పన్నకు భార్య , ఐదుగురు కొడుకులు ఉన్నారు. ముగ్గురికి వివాహాలయ్యాయి. కొద్దిరోజుల్లో పెళ్లిపీటలెక్కాల్సిన రమేష్ ఇలా మృత్యువాత పడడాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు జీర్ణించుకోలేక పోతున్నారు. రోడ్డు ప్రమా దంలో ఒకేసారి ఇద్దర్ని కోల్పోయిన వారు తీవ్ర విషాదంలో మునిగిపో యారు. విషయం తెలుసుకున్న వెంటనే టీడీపీ సీనియర్ నాయకులు గంట సాయి రామకృష్ణ, గురజాన లక్ష్మణరావు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలను ఓదార్చి అవసరమైన సహాయాన్ని అందించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిఘా పెంచాలి.. మాదక ద్రవ్యాలు అరికట్టాలి

(5వ పేజీ తరువాయి)

ఆరు కేసుల విచారణ కొనసాగుతుందని వెల్లడించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే అన్ని వసతిగృహాలు, పాఠశాలలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు తక్షణ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ... భూ సంబంధిత వివాదాల కారణంగా ఎస్సీ ఎస్టీ కేసులు ఎక్కువగా నమోదవుతు న్నాయన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ.. విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీలో జిల్లా స్థాయి అధికారులను సభ్యులుగా నియమించాలన్నారు.

## జీపు జాతాను జయప్రదం చేయండి



జీపుజాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతంపేట రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం చేసేందుకు తలపెట్టిన జీపు జాతాను జయప్రదం చేయాలని ఏపీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక అప్పారావు, తిరుపతిరావులు కోరారు. ఈ మేరకు శనివారం సీతంపేట గ్రామంలోని బస్‌స్టాండ్ ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి గిరిజన సంఘం నాయకుడు బి.అప్పారావు జెండా ఊపి జీపుయాత్రను ప్రారంభించా రు. జూన్4 వరకు ఈ జీపుజాతా కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.రాంబాబు, అధ్యక్షుడు కె.రామస్వా మి, జిల్లా సహాయ కార్యదర్శి పాలక సాంబయ్య, జీలకర్ర సుందరమ్మ, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆంజనేయస్వామి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఉత్సవమూర్తిని ఒంటి వాహనంపై గ్రామంలో వైభవంగా ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర
- కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాలు



పార్వతీపురంటౌన్: యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



పాలకొండలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది

పార్వతీపురంటౌన్, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపం ఆవరణలో వైద్యశాఖ, లయన్స్ క్లబ్, పట్టణ ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి పిలుపునివ్వడం సంతోషదాయకం అన్నారు. అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● పాలకొండ: యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా శనివారం స్థానిక గాయత్రీ కల్యాణ మండపంలో పాలకొండ డివిజన్‌కు చెందిన వైద్యులు సుమారు 430 మందికి పైగా యోగాడే ప్రోటోకాల్ ఆసనాల సాధనను శనివారం నిర్వహించారు. పాలకొండ డివిజన్ మాస్టర్ ట్రైనింగ్ ఇన్‌చార్జి కె.జనార్ధనరావు ఆధ్వర్యంలో ప్రాక్టీస్ చేశారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

## ఐటీడీఏలో ముగిసిన ఉపాధ్యాయ కౌన్సిలింగ్



బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్

సీతంపేట రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కౌన్సిలింగ్ శనివారంతో ముగిసింది. ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సబ్జెక్ట్ టీచర్‌లకు స్థానచలనం కల్పించారు. మొత్తంగా 43 మంది ఉపాధ్యాయులకు గాను ఎస్‌జీటి 37, ఎల్‌పీ తెలుగు 3, హిందీ ముగ్గురికి కౌన్సిలింగ్ నిర్వహించి ఆర్డర్లు అందజేశారు. ఈ బదిలీల ప్రక్రియలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో మంగవేణి, జీసీడీవో రాములమ్మ, ఏఎంవో కోటిబాబు, హెచ్ఎం నారాయడు ఉన్నారు.

## నకిలీ సర్టిఫికెట్లపై విచారణ చేయాలి



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న ఏజేఏసీ నాయకులు

బెలగాం/ పార్వతీపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలామంది నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ(ఏజేఏసీ) గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా జయరాజు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు హరించిపోతున్నాయని, ఎల్‌టీఆర్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించకోవడం లేదన్నారు. నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహించారు. 1/70 చట్టం అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీలకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజేఏసీ చైర్మన్ కొండగొర్రి ధర్మారావు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.8.92 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పాలకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మ ఆలయంలోని హుండీలను శనివారం తెరిచి లెక్కించారు. మార్చి 26 నుంచి నేటి వరకు 65 రోజులకు రూ.8,92,433 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయశాఖ జూనియర్ సహాయకురాలు వై.ఇందిర పర్యవేక్షణలో ఏపీజీవీబీ సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలను అందించాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రోగులతో మాట్లాడి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందుల స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో కావాల్సిన మందులను ముందుగానే ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలంలో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. రిఫరెన్స్‌లు తగ్గించి ఇదే ఆసుపత్రిలో వీలైనంత వరకు చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, లుంబేసు, మాజీ సర్పంచ్ తోయక జమ్మయ్య తదితరులు ఉన్నారు.

## మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

పార్వతీపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో వైద్యులతో సమీక్షించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పారిశుధ్య మెరుగు పనులు చేపట్టా లన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇకపై గిరిజన గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు కారాదన్నారు. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులందరికీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు, ఉప జిల్లా వైద్యాధికారి పద్మావతి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## రిమాండ్ ఖైదీలకు అన్ని సౌకర్యాలు అందించాలి



రికార్డులు తనిఖీచేస్తున్న మండల లీగల్‌సెల్ సర్వీసెస్ చైర్‌పర్సన్ హరిప్రియ

పాలకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): సబ్ జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మండ ల లీగల్‌సెల్ సర్వీసెస్ చైర్‌పర్సన్ సీహెచ్ హరిప్రియ అన్నారు. పాలకొండ సబ్‌జైలును ఆమె శనివారం సంద ర్శించారు. జైలులో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. సౌకర్యాలు, భోజనం సక్రమంగా అందుతుందో లేదోనని తెలుసుకున్నారు. బెయిల్ కోసం న్యాయవాదిని ఏర్పాటు చేయాలంటే చేస్తామన్నారు. అనంతరం జైలు సూపరిం టెండెంట్ బిజోగులుతో మాట్లాడుతూ ఇక్కడ రిమాండ్ ఉన్న వీరికి ఎటువంటి సమస్య రాకుండా చూడాలన్నా రు. అనంతరం జైల్లో ఉన్న రికార్డులు, కిచెన్ స్టోర్ రూమ్, జైలు గదులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.రవి, శామ్యూల్, హెడ్ వార్డర్ పి.చంద్రరావు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం





పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రిలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యుడు చిరంజీవి, డీఎంహెచ్‌వో కార్యాల య డెమో సెక్షన్ అధికారి యోగేశ్వర రెడ్డి మాట్లాడుతూ పొగాకు నియం త్రణ, వాటి ఆవశ్యకతపై సూచనలు, సలహాలు అందించారు. ఎన్‌టీపీసీ సోషల్ వర్కర్ కె.భవానీ, పది పీహెచ్‌సీల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తోటపల్లిలో హోల్కర్ జయంతి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

గరుగుబిల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో శనివారం అహిల్యాబాయ్ హోల్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ హోల్కర్ సేవా ధర్మ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మికతకు కృషి చేశారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పి.అశోక్, కార్యదర్శి కె.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ నాయుడు, సాలూరు మండల ఇన్‌చార్జి జి.భానోజీరావు, కొమరాడ మండల అధ్యక్షుడు డి.సురేష్, మండల మాజీ అధ్యక్షుడు శంకరరావు పాల్గొన్నారు.

## నాగావళికి స్వల్ప వరద



స్పిల్‌వే నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

గరుగుబిల్లి, మే 31(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి స్వల్పంగా వరద పోటెత్తింది. గత కొద్ది రోజులుగా పైప్రాంతం ఒడిశాలో వర్షాలు కురవడంతో శనివారం నదిలోకి 525 క్యూసెక్కులు చేరింది. ప్రాజెక్టుకు సంబంధించి 105 మీటర్ల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 104.06 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం వరద నీరు చేరుతుండడంతో నది దిగువ ప్రాంతానికి 111.5 క్యూసెక్కులను విడుదల చేశారు. ఎడమ కాలువ నుంచి 70 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

## సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

వీరఘట్టం, మే 31 (ఆంధ్రజ్యోతి): డీలర్లు సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం 56 రేషన్‌షాపులు ఉన్నాయని, 19,612 వివిధ రకాల రేషన్‌కార్డులు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 8గంటల వరకు షాపులు తెరిచి ఉంచాలని సూచించారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. 2,774 కార్డులు దివ్యాంగులు, 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు సంబంధించి ఉన్నాయని చెప్పారు. అటువంటి కార్డుదారులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందిస్తారని చెప్పారు. ● గరుగుబిల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో డీలర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులు విధించించిన విధానాలను విధిగా అమలు పర్చాలన్నారు. ఈ సమావేశంలో డీటీ బి.సుందరరావు, ఆర్ఐ గౌరీప్రసాద్, డీలర్ల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ● భామిని, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల్లో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా నిత్యావసర సరుకులు అందించాలని డీలర్లకు, సేల్స్‌మేన్లకు తహసీల్దార్ ఎన్.శివన్‌నారాయణ సూచించారు. శనివారం ఆయన డీలర్లతో సమావేశం అయ్యారు. మండలంలో 33 డిపోలలో ఆదివారం ఉదయం 8 గంటలకు సరఫరా ప్రక్రియ చేపట్టాలన్నారు. పాత పద్ధతిలో వేలిము ద్రలు నమోదు చేసి, సరుకులు అందించాలన్నారు. వీఆర్వోల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రాయుడు, ఆర్ఐ మణి ప్రభ పాల్గొన్నారు. ● సీతానగరం, మే 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల వాహనాలు రద్దు కావడంతో వినియోగదారులకు రేషన్ డీలర్లు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఎస్‌డీటీ రమేష్‌బాబు అధ్యక్షతన ఆయన వీఆర్వోలు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో 15 రోజులు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు డిపోల వద్ద సరుకులు పంపిణీ చేయాలని కోరారు. సీఎస్‌డీటీ రమేష్ బాబు మాట్లాడుతూ మండలంలోని 17,768 రేషన్‌కార్డులు ఉన్నాయని, వారందరికీ నిర్దేశించిన సమయంలో రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

## న్యూస్ బాక్స్

### ఎమ్మెల్యేకి డీలర్ల సన్మానం

వీరఘట్టం, మే 31 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను మండలంలోని రేషన్ డీలర్లు శనివారం వీరఘట్టంలో సన్మానించారు. కూటమి ప్రభుత్వం రేషన్ డీలర్ల విజ్ఞప్తిని మన్నించి నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఆదివారం నుంచి రేషన్‌షాపుల ద్వారా రేషన్ పంపిణీ జరుగుతుందని, ప్రారంభానికి రావాలని వారు ఎమ్మెల్యేని ఆహ్వానించారు.


### మంత్రికి సత్కారం

సాలూరు, మే 31(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన మహానాడు వేదికపై టీడీపీ మక్కువ మండల అధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలనాయుడుకు ప్రసంగించే అవకాశం కల్పించినందుకు ఆ మండల నాయకులు మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం వారంతా సాలూరు వచ్చి, మంత్రిని సత్కరించారు. పార్టీ కార్యకర్తలకు ప్రోత్సాహం కల్పించే దిశగా మంత్రి తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.

### దేవస్థానం నిర్మాణానికి సిమెంటు వితరణ

గరుగుబిల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు ముందుకు వస్తున్నారని అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నిధులు సమస్య కారణంగా పలు నిర్మాణం పనులు నత్తనడకన జరుగుతున్నాయన్నారు. నిర్మాణానికి అవసరమైన 500 సిమెంటు బస్తాలను తోటపల్లి బ్యారేజీ సబ్ డివిజన్-2లో డీఈఈగా విధులు నిర్వహిస్తున్న బొంగు గోవిందరావు, పద్మావతి దంపతులు అందించారని చెప్పారు.

### పాలకొండ సీఐకి ప్రశంసా పత్రం



సీఐ చంద్రమౌళికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

పాలకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్ కేసుల ఛేదించడంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన పాలకొండ సీఐ చంద్రమౌళిని ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు. ఈ మేరకు శనివారం పార్వతీపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సీఐని అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని అందించారు.

### అంధకారంలో భామిని

భామిని, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రతిరోజూ సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. శనివారం కూడా ఎప్పటిలాగే విద్యుత్ నిలిచిపోయింది. దీంతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా ఇన్‌పుట్ సరఫరా బ్రేక్‌డౌన్ ఉందని, వచ్చిన వెంటనే సప్లయి ఇస్తామన్నారు.

### బాల్య వివాహాలు వద్దు

సాలూరు రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్వహించవద్దని స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జీగిరాం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్ల నిండకుండా పిల్లలకు వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి నాయకులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాల పంపిణీ

బొబ్బిలి రూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పరిధిలో గల అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. బొబ్బిలి ప్రాజెక్ట్ పరిధిలోగల 212 అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు పీపీ-1 బుక్స్ 3912, పీపీ-2 బుక్స్ 3,564 పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు.